# ‘పంటలకు న్యాయమైన ధర చెల్లించాలి’

## నాగాయలంకలో బహిరంగసభ

**నాగాయలంక, 4-6-17 :**

పంటలకు న్యాయమైన ధర కల్పించాలని, వ్యవసాయంపై పన్ను ప్రతిపాదన విరమించాలని, ఇతర రైతాంగ సమస్యలపై రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 4-6-2017న నాగాయలంకలో బహిరంగ సభ జరిగింది. సభకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కోశాధికారి కా॥ తలసిల లీలా మనోహర్ అధ్యక్షత వహించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ ‘పాలకులు వ్యవసాయరంగాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే సంక్షోభంలోకి నెట్టారని’ అన్నారు. ‘రాష్ట్ర ప్రభుత్వం వాల్‌మార్ట్, పెప్సీ వంటి 16 విదేశీ, స్వదేశీ బడా కంపెనీలతో వ్యవసాయ ఉత్పత్తులపై ఒప్పందం చేసుకొంది. ఇప్పటికీ రైతుకు న్యాయమైన ధర లభించటంలేదు. ఉత్పత్తి ఖర్చుకు, ప్రకటిస్తున్న మద్దతు ధరకు సంబంధం ఉండటంలేదు. మిర్చి, అపరాలు, కందుల రైతుల పరిస్థితి మరీ దారుణంగా వుంది. ఈ స్థితిలో విదేశీ కంపెనీలతో ఒప్పందం చేసుకోవడంతో, రైతుకు న్యాయమైన ధర అలా వుంచి కనీసపాటి ధర కూడా లభించదు; వినియోగదారులకు ధర అందుబాటులో వుండదు. వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాద దోపిడీకి బలిచేసేందుకు పాలకులు ఊడిగం చేస్తున్నారు. తరుణంలో సాగుకు సాగునీరు అందించాల్సి ఉన్నా పాలకులు ఉద్దేశ్యపూర్వకంగానే ఇవ్వటంలేదు. విద్యుత్ ఉత్పత్తికి, పరిశ్రమలకు, జలరవాణాకు ప్రాధాన్యతనిచ్చి, సాగునీరు సరఫరా చేయకుండా రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మరోవైపున కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై పన్ను విధించేందుకు సన్నాహం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో దళారీ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమించాలని’ కా॥ సోనీ విజ్ఞప్తి చేశారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకమిటి సభ్యులు కా॥ ముచ్చు సుధాకరరావు పాలకులు చేపట్టే అభివృద్ధి డొల్లతనాన్ని సోదాహరణంగా వివరించారు. ప్రజా కళాకారుల సమాఖ్య, బాలకళాకారులు పాడిన పాటలు, ప్రదర్శించిన ‘నెత్తుటి దీపాలు’ సభికులను బాగా ఆకట్టుకొన్నాయి.

ooooo